సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం, 19, ఏప్రిల్, 2025



పట్టుకోండి చూద్దాం..!

ప్రొద్దుటూరులో ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువగా జరిగాయి. దొంగలు మాత్రం పోలీసులకు దొరక్కుండా తప్పించుకుంటున్నారు. బాధితులు లబోదిబోమంటున్నారు. -10లో



'ఎర్రచందనం' మాయంపై ఏసీబీ కేసు

వనిపెంట అటవీ రేంజ్ గోడౌన్ నుంచి 37 దుంగలు మాయమయ్యాయి. ఇందుకు సంబంధించి 15 మంది అటవీ అధికారులపై ఏసీబీ కేసు నమోదు చేసింది. -10లో

గరిష్టం/కనిష్టం
39.6/27.2

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.2 - 39.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఫోన్ పోయిందా.. వచ్చి తీసుకెళ్లండి

కడప అర్బన్: కడప సైబర్ పోలీస్ వారు 6 నెలలుగా 602 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. ఇప్పటి వరకు 275 మంది బాధితులు మాత్రమే వారి ఫోన్లను ఆధారాలు చూపించి తీసుకెళ్లడం జరిగింది. ఇంకా సుమారు 327 మంది వారి మొబైల్స్ తీసుకు వెళ్లాల్సి ఉంది. మీ మొబైల్ ఫోన్ పోయినట్లుగా పోలీస్ స్టేషన్‌లో కంప్లెయింట్ చేసిన వారు.. మీ మొబైల్‌కు సంబంధించిన ఆధారాలతో కడప సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని సంప్రదించి, మీ మొబైల్ ఫోన్‌ను తీసుకొని వెళ్లగలరు. మరిన్ని వివరాలకు 08562 245490 నంబర్‌కు ఫోన్ చేయాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

నేడు స్వచ్ఛ దినోత్సవం

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఈ నెల 3వ శనివారం ఈ-చెక్ అనే థీమ్‌తో స్వచ్ఛ దినోత్సవాన్ని నిర్వహించాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన అంశాలపై శుక్రవారం టెలీ కాన్ఫరెన్సు ద్వారా అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం జరగనున్న కార్యక్రమాల గురించి శుక్రవారం రోజున టాం టాం, మైక్ ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అన్ని కార్యక్రమాలు ఏ ప్రదేశాలలో జరుగుతాయో ప్రజలకు తెలియజేసి, వారందరినీ భాగస్వాములుగా చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఈ-వేస్ట్ సేకరణ/కలెక్షన్ డ్రమ్/బాక్సు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సంస్థలు, ప్రజలంతా పాల్గొని ఈ-వేస్ట్ బాధ్యతను గుర్తించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అలాగే పబ్లిక్ ప్లేస్‌లలో పోస్టర్లు ప్రదర్శించాలని, ఈ-వేస్ట్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని, ప్రతి గ్రామ పంచాయతీలో ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు.

ఉపాధ్యాయుల వివరాలు తెలపాలి



మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ శామ్యూల్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యకు సంబంధించిన సమాచారాన్ని ఎంఈఓలు అందజేయాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శామ్యూల్ సూచించారు. శుక్రవారం కడప డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎంఈఓలకు జీవో నంబర్ 117పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 117లో భాగంగా 3,4,5 తరగతులను హైస్కూల్‌ను నుంచి వెనక్కు తెచ్చే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందన్నారు. అలాగే 60 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలను బేసిక్ మోడల్ ప్రైమరీ స్కూల్‌గా, 60 నుంచి 150 మందిలోపు ఉన్న పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఏర్పాటు చేయనుందన్నారు. దీంతో పాటు డీఎస్సీ నిర్వహణ కూడా ఉందన్నారు. డీఈఓ షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ఈ నెల 24 నుంచి 26 వరకు అనారోగ్య సమస్య లున్న ఉపాధ్యాయులకు మెడికల్ సర్టిఫికెట్ల కోసం రిమ్స్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రమణ్యం, ఏడీ మునీర్‌ఖాన్ ఏఎస్ఓ బ్రహ్మానందరెడ్డి, ఏపీఓలు జాలాపతి నాగేంద్రరెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు.

మహా(నాడు) లాభం!

- బుగ్గవంక జంగిల్ క్లియరెన్సు పేరిట దోపిడీ
- రూ.10 లక్షల పనికి రూ.కోటికి ప్రతిపాదనలు
- టీడీపీ ముఖ్యనేత వర్గీయులకే కాంట్రాక్టు పనులు
- వైరి పక్షం టెండర్ డాక్యుమెంట్లు మాయం చేస్తున్న వైనం



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహానాడు జిల్లాలో నిర్వహించదలిచింది. స్థానిక నాయకులు ముఖ్య నేతల ఆతిథ్యం ఖర్చులు భరించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో 'మహా'లాభం చూపించే చర్యలకు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు రూపాయి పనికి.. పది రెట్లు అధికంగా ప్రతిపాదనలు చూపెట్టి టెండర్లు ఆహ్వానించారు. ఈ ప్రొక్యూర్‌మెంటు టెండర్ అయినప్పటికీ, ఆ పనులన్నీ జిల్లా ముఖ్య నేత సూచించిన వారికే కట్టబెట్టాలని దిశా నిర్దేశం చేశారు. ఆ మేరకు తూచ తప్పకుండా ఆచరించే పనిలో ఇరిగేషన్ కార్యాలయం తలమునకలై ఉంది.

టెక్నికల్ ఆఫీసర్‌తో సంబంధం లేకుండా ఓపెన్

బుగ్గవంక పరిధిలో దాదాపు 10 పనులకు టెండర్లు పిలిచారు. అందులో ఉదాహరణగా ఒక టెండర్‌ను పరిశీలిస్తే, ఐడీ నంబర్ 798710 బుగ్గవంకలో 2,600 మీటర్ల నుంచి 3,060 మీటర్ల వరకూ రూ.35,33,145 ఈ పనికి నలుగురు టెండర్లు దాఖలు చేశారు. ఏకే కన్‌స్ట్రక్షన్స్, నంద్యాల వెంకటేష్, ఎస్వీఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్, గోసుల నవీన్‌కుమార్‌రెడ్డిలు టెండర్లలో పాల్గొన్నారు. అన్నీ అర్హతల డాక్యుమెంట్లు సమర్పించిన వారిలో ఒకరు 7 శాతం లెస్‌కు, మరొకరు 6.9 శాతం, ఇంకొకరు 5 శాతం లెస్‌కు టెండర్లు దాఖలు చేశారు. వారెవ్వరికీ టెండరు ఖరారు కాకపోగా, 0.020 అదనపు రేట్లకు దాఖలు చేసిన ఎస్వీఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్‌కు టెండర్ కట్టబెట్టారు. లెస్‌కు టెండర్ దాఖలు చేసిన వారి డాక్యుమెంట్లు తొలగించినట్లు సమాచారం. టెక్నికల్ ఆఫీసర్‌కు సంబంధం లేకుండా ఉన్నతాధికారులు టెండర్ ఓపెన్ చేసి.. వైరిపక్షం కాంట్రాక్టర్లను డిస్ క్వాలిఫై చేసి, ముఖ్యనేత సూచించిన ఎస్వీఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్‌కు కట్టబెట్టారు. ఇలా అనుకున్న వారికే టెంటర్లు కట్టబెడుతూ.. జిల్లా ముఖ్యనేత సేవలో ఇరిగేషన్ కార్యాలయం తరిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

మహానాడు ఖర్చులకు సర్దుబాటు చర్యలుగా ప్రచారం

ఇరిగేషన్ కార్యాలయంలో రూ.3.25 కోట్లతో 10 పనులు, ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) ద్వారా మరో రూ.6.25 కోట్లతో 28 పనులు చేపట్టారు. వివిధ కళాశాలల్లో మెయింటెన్సు పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. ఈ పనులన్నింటిలోనూ టీడీపీ ముఖ్యనేత సూచించిన వారికే కట్టబెట్టాలనే దిశగా అటు ఇరిగేషన్ కార్యాలయం, ఇటు ఏపీఈడబ్ల్యూఐడీసీ శాఖ పరిధిలో పనులు మహానాడు ఖర్చు కోసమే ఇలా చేస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తుండటం గమనార్హం.

ఏకపక్షంగా పనుల అప్పగింత

తక్కువ డబ్బుతో ఎక్కువ బిల్లులు చేసుకునే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ జిల్లాలోని ఉన్నతాధికారులకు డైరెక్షన్స్ వచ్చాయి. వెరసి బుగ్గవంకలో జంగిల్ క్లియరెన్సు పనులు ఎంచుకున్నారు. నగర పరధిలోని బుగ్గవంకలో 3.85 కిలోమీటర్ల మేర రూ.3.25 కోట్లతో జంగిల్ క్లియరెన్సు చేపట్టి లెవెల్స్ చేయు పనులు పెట్టారు. బిట్లుగా విభజించి దాదాపు 10 పనులుగా చేశారు. మొత్తం ఆ పనులన్నీ కిలోమీటరుకు రూ.10 లక్షలతో చేయదగ్గ పనికి రూ.1 కోటితో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ మేరకు టెండర్లకు ఆహ్వానించారు. ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు అయినప్పటికీ టెండర్లు ఏకపక్షంగా జిల్లా ముఖ్యనేత సూచించిన వారికే కట్టబెట్టాలని నిర్ణయించారు. ఆ మేరకు సన్నాహాల్లో ఇరిగేషన్ కార్యాలయం నిమగ్నమై ఉందనే ఆరోపణలు ఉన్నాయి.

బుగ్గవంక పనుల టెండర్లు రద్దు చేయాలి

కడప కార్పొరేషన్: బుగ్గవంకను అభివృద్ధి చేయడానికి ఇరిగేషన్ శాఖ నిర్వహించిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పొట్టిపాటి జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బుగ్గవంకలో జంగిల్ క్లియరెన్స్, గుర్రపుడెక్కను తొలగించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు రూ.3.25 కోట్లతో పది భాగాలుగా విభజించి టెండర్లు పిలిచారన్నారు. ఇందులో తక్కువకు టెండరు వేసిన కాంట్రాక్టర్‌ను బిల్లులు రాకుండా చేస్తామని, విజిలెన్స్‌తో విచారణ చేయిస్తామని బెదిరించారన్నారు. అతనితోనే ఈ పనులు చేయలేనని లెటర్ తీసుకొని, ఎక్కువ మొత్తానికి టెండర్ వేసిన వారికి పనులు అప్పగించారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు లబ్ధి చేకూర్చడానికే ఎస్‌వీఎస్ కన్‌స్ట్రక్షన్ వారికి వర్క్‌ను కట్టబెట్టారన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఈ పనులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2014-19లో కూడా టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి నీరు-చెట్టు పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో చేయాల్సిన పనులను కడప నగరంలోని బుగ్గవంకలో చేసి ఆ పనులకు ఇప్పుడు బిల్లులు నమోదు చేస్తున్నారన్నారు. అలాగే కడప నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి వైద్యులను బెదిరించి డబ్బులు వసూలు చేయాలనుకోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, ఐస్‌క్రీం రవి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్

మెడికల్ అండ్ హెల్త్ డీడీగా శేఖర్

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా శేఖర్ నియమితులయ్యారు. ఈయన కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న భక్తవత్సలం పదోన్నతిపై ఏపీ రిక్రూట్‌మెంట్ బోర్డు జాయింట్ డైరెక్టర్‌గా వెళ్లారు. దీంతో ఈ స్థానంలోకి శేఖర్ వస్తున్నారు.

దంత సంరక్షణపై అవగాహన



దంతవైద్య కళాశాల ఆవరణలో వైద్య విద్యార్థుల ప్రదర్శన

కడప అర్బన్: వరల్డ్ ఓరల్ హెల్త్ డే మార్చి 20 సందర్భంగా డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రాం వారిచే నిర్వహించే వివిధ నోటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాల వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. నెల రోజులు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా వాకతాన్ చేశారు. పుచ్చిన పళ్ల సమస్యలు, దంతాల సంరక్షణతోపాటు గుట్కా, ఖైని, పొగాకు, మందు మొదలగునవి అరికట్టే విధానం ప్రాథమిక దశలో రోగనిర్ధారణ చేయగలిగిన పరికరాలు, నోటి క్యాన్సర్‌పై ప్రజలలో అవగాహన కల్పించారు. నోటి ఆరోగ్యం, శరీర ఆరోగ్యం ఎలా సంరక్షించుకోవాలో ముందుగా దంత వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించడానికి వాళ్లకు వివిధ పోటీలు నిర్వహించారు. ఏప్రిల్ 9న వాకతాన్ మహావీర్ సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల సమయంలో యూజీ, పీజీ దంత వైద్య విద్యార్థులు, స్టాఫ్ పాల్గొన్నారు. ఏప్రిల్ 17న గ్రూప్ టూత్ బ్రెషింగ్ పద్ధతి, నోటి ఆరోగ్యం అవగాహన ప్రజల్లో దంత సంరక్షణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జ్యోత్స్న, వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్)డాక్టర్ పి.సురేష్ ప్రోత్సహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లీల తమవంతుగా కృషి చేశారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జోత్స్న, డాక్టర్ శంకర్ వాకతాన్‌లో పాల్గొన్నారు.

యువకుడి లాకప్‌డెత్‌పై విచారణ

- పోలీసు సిబ్బందితో డీఎస్పీ వివరాల సేకరణ
- సీసీ ఫుటేజీల పరిశీలన



కడప టూటౌన్ పోలీస్ స్టేషన్



కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద విచారణ చేస్తున్న డీఎస్పీ కె. వెంకటేశ్వరరావు

కడప అర్బన్: కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన యువకుడి లాకప్‌డెత్‌పై పోలీస్ అధికారులు సమగ్ర విచారణ చేపడుతున్నారు. కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాసాపేటలో నివాసం వుంటున్న షేక్ సోను (23)ను ఈ నెల 16వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో 211/2024 గంజాయి కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. మరుసటి రోజున 17న ఉదయం 10 గంటల సమయంలో కోర్టులో హాజరు పరచాల్సి ఉంది. ఈ క్రమంలో లాకప్‌లో ఉంచారు. దాదాపు తెల్లవారుజా మున 3:20 గంటల సమయంలో అతను తన షర్ట్‌కు ఉన్న ఒక చేతిగుడ్డను మెడచుట్టూ చుట్టుకున్నాడు. తరువాత ఇంకో చేతిగుడ్డను లాకప్‌లోని బాత్‌రూం పిట్టగోడను ఎక్కి.. కిటీకికి వున్న గ్రిల్‌కు దగ్గరగా వెళ్లి కట్టి వేలాడాడు. గిలగిలా కొట్టుకుని, గింజుకుంటూ ఉండగా.. చివరి నిమిషంలో విధుల్లో వున్న మహ మ్మద్ అనే కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, ఏఎస్ఐ నారాయణ గమనించి వెంటనే బయ టికి తీసుకుని వచ్చారు. తమ వంతుగా సీపీఆర్‌ను నిర్వహించారు. వెంటనే రక్షక్ పోలీసు వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌కు చేరుకోగానే డాక్టర్లు షేక్ సోనుకు వైద్య పరీక్షలు చేసి మృతి చెందా డని నిర్ధారించారు. ఈ నెల 17న అతని మృతదేహానికి ఇన్‌చార్జి ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో మెజిస్ట్రీరియల్ విచారణ చేపట్టి, రిమ్స్ వైద్యులచే పోస్టుమార్టం నిర్వహింపచేసి బంధువులకు అప్పగించారు.

ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తాం: డీఎస్పీ

ఈ సంఘటన జరిగిన తరువాత విచారణ అధికారిగా జమ్మలమడుగు డీఎస్పీ కె.వెంకటేశ్వరరావును నియమించారు. మృతదేహానికి సంబంధించిన పోస్టుమార్టం ప్రక్రియకు ముందుగా.. మృతుడి బంధువులను డీఎస్పీ విచారణ చేశారు. పోస్టుమార్టం తరువాత కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు విచ్చేశారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని అంశాలపై సమగ్రంగా విచారణ చేశారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. తనను విచారణ అధికారిగా ఉన్నతాధికారులు నియమించిన క్షణం నుంచే విచారణ ప్రారంభించామన్నారు. కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు గంజాయి కేసులో నిందితుడిగా వున్న షేక్ సోనును తీసుకుని వచ్చినప్పటి నుంచి.. ఉరేసుకున్న తరువాత పోలీసు రక్షక్ వాహనంలో అతన్ని తరలించే వరకు సీసీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. అలాగే కానిస్టేబుల్ మహమ్మద్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, ఏఎస్ఐ నారాయణ విధుల్లో వున్నప్పుడు ఏయే అంశాలు జరిగాయో వివరంగా విచారణ చేస్తున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌లో లాకప్‌లో వున్న బాత్‌రూం కిటికీ గ్రిల్‌కు చొక్కాతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసిన తరువాత ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యమే కారణమా..!



షేక్ సోను (ఫైల్)

లాకప్‌లో వున్న షేక్‌సోను కదలికలను గమనించడంలో జరిగిన నిర్లక్ష్యమే ఇందుకు కారణమనీ తెలుస్తోంది. ఈ సంఘటనలో డిపార్ట్‌మెంట్ పరంగా విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో.. ఎవరెవరి బాధ్యత ఎంతెంత అని గుర్తించి శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు.

క్రీస్తు సందేశం.. క్షమా గుణం



కడప మహావీర్ సర్కిల్‌లో శిలువ యాగం

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ప్రసంగించిన క్రైస్తవ మత గురువులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక రక్షకుడైన క్రీస్తు.. సర్వ మానవపాప విముక్తి కోసం మరణ శిక్ష పొందిన రోజును శుభ శుక్రవారంగా పేర్కొంటూ.. క్రైస్తవ విశ్వాసులందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరుణామయుడు సిలువ మోసిన రోజును స్మరించారు. అన్ని క్రైస్తవ మందిరాలు కిక్కిరిశాయి. మానవులు చేసిన పాపాలను తను మోస్తూ సిలువపై ప్రాణాలను అర్పించి త్యాగాన్ని చాటిన ఏసును స్తోత్రాలతో కీర్తించారు. సిలువ ధ్యానాన్ని పాటించారు. భక్తితో 40 రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించిన విశ్వాసులు.. శుక్రవారం వాటి విరమణ చేశారు. సంప్రదాయం ప్రకారం పేదలకు దానం చేశారు. అనంతరం చర్చిలకు తరలివెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగర, పట్టణ వీధుల్లో క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు సిలువ మార్గ దృశ్యాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

ప్రజల రక్షణ కోసం ప్రాణ త్యాగం

ఈ సందర్భంగా క్రైస్తవ మత గురువులు గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. గుడ్ ఫ్రైడేను బ్లాక్ ఫ్రైడే అని కూడా పిలుస్తారని తెలిపారు. దీనిని ఒక శుభకార్యంలా కాకుండా.. క్రీస్తు సంతాప దినంగా జరుపుకొంటారని పేర్కొన్నారు. ఏసుకు శిలువ వేసిన మూడు రోజుల తర్వాత.. పునరుత్థానాన్ని ఆదివారం రోజు ఈస్టర్‌గా పాటిస్తారని చెప్పారు. క్రైస్తవ సమాజంలో అత్యంత ప్రత్యేకమైన రోజుగా పరిగణిస్తారన్నారు. దేవుడిగా ఆరాధించే ఏసుక్రీస్తుకు శిలువ వేసిన రోజే గుడ్‌ఫ్రైడే అని తెలిపారు. ప్రజల రక్షణ కోసం క్రీస్తు తన జీవితాన్ని త్యాగం చేశారని పేర్కొన్నారు. అందుకే ఈ రోజున అందరూ ఉపవాస దీక్షలు చేసి క్రీస్తును పూజిస్తారని వివరించారు. క్షమా గుణమే ఏసు క్రీస్తు పరిచర్య అని, ప్రజలందరూ శాంతి సమాధానం కలిగి ఉండాలని హితవు చెప్పారు. అన్ని గుణాలకన్నా క్షమా గుణం గొప్పదన్నారు. క్రీస్తు జీవితం, బోధనలు అందరికీ ఆదర్శనీయమన్నారు.



బద్వేలులో శిలువయాత్ర నిర్వహిస్తున్న ఫాతిమామాత చర్చి సంఘస్తులు



కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు

లాఠీన్యాం..!

- గ్యాంబ్లర్‌ను చితకబాదిన ఎస్ఐ
- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న బాధితుడు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జిల్లాలో కొందరు పోలీసు అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. తాజాగా కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధి పులివెందుల ప్రధాన రహదారిలో వున్న పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి వ్యవహరించిన తీరు ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చును. విశ్వసనీయ వర్గాల ద్వారా వచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో వున్న నాగాయపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు, గ్యాంబ్లర్ రామ ఓబుళరెడ్డి అలియాస్ ఇంద్రసేనారెడ్డి కొంత కాలంగా తమ మండల పరిధిలో జరుగుతున్న 'మొబైల్ గ్యాంబ్లింగ్'కు వెళ్తుండేవాడు. ఆయన పేకాట నిర్వాహకులకు, పోలీస్ అధికారులకు 'అనుకున్నంత' విధంగా డబ్బులను సమకూర్చుతూ 'వారధి'గా నిలిచాడనే ఆరోపణలున్నాయి. ఈక్రమంలో గురువారం సాయంత్రం ఎస్ఐతో మాట్లాడేందుకు వెళ్లి.. సెల్‌ఫోన్‌ను మర్చిపోయి వెళ్లాడు. బయటికి వచ్చి మరలా సెల్‌ఫోన్ కోసం వెళ్లగా.. ఎస్ఐ గదమాయించి రామ ఓబుళరెడ్డి అలియాస్ ఇంద్రసేనారెడ్డిని బయటకు పంపించివేశాడు. తరువాత కొంతసేపటికి రామ ఓబుళరెడ్డి మద్యం తాగి వచ్చి విధుల్లో వున్న ఎస్ఐతో వాగ్వివాదానికి దిగాడు. ఈ వాగ్వివాదం కాస్త ఘర్షణకు దారి తీసింది. దీంతో ఎస్ఐ తన లాఠీని ఝుళిపించారు. రామ ఓబుళరెడ్డిని చితకబాదాడు. పోలీస్‌స్టేషన్ నుంచి కొంతదూరం రోడ్డుపైనే ఈడ్చుకుంటూ తీసుకుని వెళ్లాడు. తరువాత స్థానికులు విడిపించడంతో కొంత సమయం తరువాత కడప రిమ్స్‌కు చికిత్స కోసం రామ ఓబుళరెడ్డిని తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రామ ఓబుళరెడ్డి అలియాస్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ తన సెల్‌ఫోన్ కోసం వెళితే తనపై ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలనీ విజ్ఞప్తి చేశాడు. గురువారం రాత్రి జరిగిన సంఘటనలో ఎస్ఐపై దాడికి పాల్పడ్డాడరి రామ ఓబుళరెడ్డిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ దాడిలో గాయపడిన రామ ఓబుళరెడ్డి రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఔట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రామఓబుళరెడ్డి

- పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ప్రవర్తన ఆది నుంచి వివాదాస్పదమే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి చిన్న విషయానికి లాఠీతో కొట్టడం పరిపాటిగా మారుతోంది. ఇటీవల వాహనాల తనిఖీలో ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్ నిలబెట్టకుండా వెళ్లినందుకు వారిని ఛేజ్ చేసి లాఠీ విసరగా బైక్ చక్రాల మధ్యలో ఇరుక్కుని వారిద్దరూ కిందపడి ఓ వ్యక్తి తలకి గాయం, ఇంకో వ్యక్తికి చేయి ఫ్రాక్చర్ అయ్యాయి. వారు ఈ విషయమై ఎస్పీ దగ్గరికి వెళ్లాలనే యోచనలో వుండగా.. పెద్ద మనుషుల జోక్యంతో విరమించుకున్నారు.
- గురువారం సాయంత్రం వెల్లటూరు వద్ద వాహనాల తనిఖీలో వెల్లటూరు మెయిన్‌రోడ్డులో వుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న తల్లి, కుమారుడు ఎస్ఐ కొడతాడేమోననే భయంతో.. తల్లి వాహనంపై నుంచి దూకి కిందపడగా, ఆ ఎస్ఐ ఆ అబ్బాయిని లాఠీతో బాదడంతో చూసేవారు విస్మయం చెందారు.
- రెండు నెలల క్రితం పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్ వద్దనే ఓ పెద్ద వాహనం, ఓ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొంది. ఢీకొట్టిన వాహన యజమాని.. గాయాలైన ద్విచక్ర వాహదారుడిని తీసుకెళ్లి ఆసుపత్రిలో చేర్పించి చూపించారు. దానిపై ఎలాంటి కేసు లేదు. కానీ ద్విచక్ర వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌లోనే వుంచుకుని దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇవ్వకపోవడంతో అతని భార్య పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బైకును ఇవ్వాలని అడుగగా ఆమెను గద్దించి పంపినట్లు సమాచారం.



గాయాలు చూపుతున్న బాధితుడు

క్లుప్తంగా

అప్పులిచ్చిన వారికి ఐపీ నోటీసులు

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామంలో ఓ వ్యాపారస్తుడు ఐపీ పెట్టడంతో అప్పులు ఇచ్చిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యాపారులు ఉన్నట్లుండి ఐపీ నోటీసులకు కోర్టు ద్వారా పంపించడంతో బాధితులందరూ శుక్రవారం ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌కు చేరి తమకు న్యాయం చేయాలంటూ పోలీసుల ముందు వాపోయారు. చిలంకూరు గ్రామంలో నమ్మకంగా ఉన్న వ్యాపారస్తుడు ప్రజల వద్ద నుంచి అధిక వడ్డీకి దాదాపు మూడు కోట్లకుపైగా అప్పుగా తీసుకున్నాడు. దానిని చెల్లించలేని పరిస్థితి అప్పులు ఇచ్చిన వారికి కోర్టు ద్వారా ఐపీ నోటీసులు ఇవ్వడంతో బాధితులు ఒక్కసారిగా అవాక్కైపోతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బద్వేలు అర్బన్ : పట్టణంలోని సిద్దవటం రోడ్డులోని లైఫ్‌స్టైల్ రెడీమేడ్స్ పక్క సందులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ పంచనామా నిర్వహించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లైతే అర్బన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

కారు ప్రమాదంలో యువకుడు మృతి

– ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన కారు



వెంకట సాయి(ఫైల్)

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం సమీపంలోని నిడివెల్ల గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన కారు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా సింహాద్రిపురం మండలం నిడివెల్ల గ్రామ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. ప్రమాదంలో యువకుడు వెంకటసాయి మృతి చెందగా, మణిదీప్, శివచంద్ర, వేణులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించామన్నారు. గాయపడ్డ వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

లారీని ఆపబోయి కారు డ్రైవర్‌కు గాయాలు

కొండాపురం : మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామ సమీపంలోని తాడిపత్రి– ముద్దనూరు ఎన్‌హెచ్–67 రోడ్డుపై శుక్రవారం కొండాపురం గ్రామానికి బోడోల్ల పెద్దన్న ద్విచక్ర వాహనంపై వెళుతుండగా లారీ కంటైనర్ ఢీ కొని వెళ్లిపోతోంది. దీనిని వెనుక వస్తున్న కారు డ్రైవర్ గమనించి లారీని ఆపడం కోసం ప్రయత్నించి గాయలపాలయ్యాడు. కడప వైపు నుంచి తాడిపత్రి వైపునకు వెళ్తున్న కారు డ్రైవర్ పసుపులేటి రమణరెడ్డి లారీ కంటైనర్ ఆపడానికి ప్రయత్నించగా పి. అనంతపురం సమీపంలోని కణం వద్ద ఉన్న ఎస్సీ కాలనీ దగ్గర కారును లారీ కంటైనర్ ఢీ కొట్టడంతో కారు పల్టీ కొట్టింది. ప్రమాదంలో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఖాకీలకు సవాల్.. పట్టుకోండి చూద్దాం..!

- పగలు రెక్కీ.. రాతిళ్లు లూటీ
- తాళం వేసిన ఇళ్లను కొళ్లగొడుతున్న దుండగులు
- ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున జరిగిన భారీ చోరీలు
- దొంగల జాడ కనిపెట్టలేకపోతున్న పోలీసులు
- చోరీ సొత్తు దొరక్క లబోదిబోమంటున్న బాధితులు



లక్ష్మీనగర్‌లో డోర్ లాక్‌ను విరిచేసిన దొంగలు (ఫైల్)



హౌసింగ్‌బోర్డు కాలనీలో చోరీ జరిగిన గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఇల్లు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో దొంగలు దొరికింది దొరికినట్లు దోచుకొని ఇళ్లను కొల్లగొడుతున్నారు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, శివారు ప్రాంతాలు వేటినీ వదల్లేదు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో ఇళ్లను ఊడ్చేస్తున్నారు. ఇంటికి తాళం వేస్తే చాలు ఎంతటి సెక్యూరిటీ ఉన్నా రంగంలోకి దిగుతున్నారు. పక్కా ప్లాన్ అమలు చేస్తూ మరీ సులభంగా దొంగతనాలు చేస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో దొంగలపై పోలీసులు నిఘా పెడుతుంటే.. పోలీసుల ఊహలకు దొరక్కుండా వారి కంటే ఫాస్ట్‌గా దొంగలు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రొద్దుటూరులో జరుగుతున్న వరుస దొంగతనాలు ప్రజలను కలవరపెడుతున్నాయి. ఎక్కడ చోరీ జరిగినా 40–50 తులాల బంగారు, కిలోల లెక్కన వెండి, రూ. లక్షల్లో నగదు ఉంటోంది. నాలుగైదు రోజులు లోతుగా రెక్కీ నిర్వహించి సంపన్నుల ఇళ్లనే దుండగులు టార్గెట్ చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రశాంతంగా ప్రొద్దుటూరులో వరుస దొంగతనాలతో అలజడి నెలకొంది. ఎప్పుడు ఏ ఇంట్లో దొంగలు పడతారోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చోరీలు ఫుల్.. రికవరీ నిల్:

ప్రొద్దుటూరుతో పాటు రూరల్ మండలంలో ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువగా జరిగాయి. దొంగలు మాత్రం పోలీసులకు దొరక్కుండా ఎంతో చాకచక్యంగా తప్పించుకుంటున్నారు. దీంతో చోరీ సొత్తు రికవరీ కాక పోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. బంగారం బాగా ప్రియమైంది. తులం బంగారు రూ. 1 లక్ష చేరువలో ఉంది. రెండు, మూడు తులాలు బంగారు చోరీకి గురైనా సుమారు రూ. 3 లక్షల వరకు ఆయా బాధితులు నష్టపోవాల్సి వస్తుంది. ఇంట్లో బంగారు పెట్టుకోకుండా లాకర్లలో భద్రపరుచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

సీసీ కెమెరాల్లో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న దొంగలు

చోరీ జరిగిన తర్వాత దొంగల ఆచూకీ కోసం పోలీసులు సీసీ కెమెరాలపై ఆధారపడటం సహజంగా జరిగే ప్రక్రియ. సీసీ కెమెరాలను పరిశీలించి అందులో దొంగల కదలికలు రికార్డు అయితే పోలీసుల దర్యాప్తు సులభతరం అవుతుంది. సీసీ పుటేజీల్లో నిందితుల జాడ కనిపించపోతే ఫింగర్ ప్రింట్‌ల ఆధారంగా దొంగల ఆచూకి కనుగొంటారు. అయితే ఇటీవల దొంగలు నిఘా కెమెరాల్లో పడకుండా జాగ్రత్త పడుతున్నారు. రెక్కీ నిర్వహించే క్రమంలో ఇంటి పరిసరాలను కూడా వారు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సీసీ కెమెరాలు ఉన్నా వాటి కంట పడకుండా ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నారు. చేతి గుర్తులు పడకుండా గ్లౌజ్‌లు తొడుక్కుంటున్నట్లు పోలీసులే చెబుతున్నారు. ఇటీవల లక్ష్మీనగర్‌లో జరిగిన చోరీ ఘటనను పరిశీలిస్తే దొంగలు ఎంత తెలివి మీరారో ఇట్టే అర్థం అవుతుంది. అక్కడి ప్రవేశ ద్వారంలోనూ, కాంపౌండ్ లోపల సీసీ కెమెరాలు ఉన్నాయి. అయితే దొంగలు వాటిలో పడకుండా చోరీ చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీలో కూడా దొంగలు సీసీ కెమెరాల్లో పడలేదు. చోరీ జరిగిన ఇంటి ఎదురుగా, పక్క వీధుల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. దొంగలు ఇంటి వెనుక వైపు నుంచి శివశంకర్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. కాగా పట్టణంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ప్రధాన వీధులు, రహదారులు, కూడళ్లలో సీసీ కెమెరాలు పని చేయలేదు. దీంతో దొంగతనాలు జరిగినప్పుడు దొంగల ఆచూకి తెలుసుకోవడం పోలీసులకు కష్టంగా మారుతోంది. ప్రధాన కేసుల్లో దొంగలు ఇప్పటికీ దొరకలేదు. దీంతో సొత్తు రికవరీ కాక పోవడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

రాత్రి గస్తీ ముమ్మరం చేసిన పోలీసులు :

ప్రొద్దుటూరులో వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు రాత్రి గస్తీ ముమ్మరం చేశారు. బ్లూకోల్ట్స్‌ను అప్రమత్తం చేశారు. బొల్లవరంలో రెండు రోజుల క్రితం చోరీ జరిగిన ప్రాంతంలో అర్ధ రాత్రి 12 గంటల సమయంలో బ్లూ కోల్ట్స్ పోలీసులు అక్కడికి వచ్చి వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. అయితే బ్లూకోల్ట్స్ పోలీసులు వచ్చి వెళ్లిన తర్వాత అనగా 1.10 గంటల ప్రాంతంలో దొంగలు కాలనీలోకి ప్రవేశించారు. ఆయా స్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్ఐలు కూడా రాత్రి వేళల్లో గస్తీ తిరుగుతున్నారు. ఇళ్లకు తాళం వేసి బయటికి వెళ్లాల్సి వస్తే ఎల్‌హెచ్ఎంఎస్‌తో పని చేసే నిఘా కెమెరాలను ఇంట్లో పెట్టుకోమని పోలీసులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే పోలీసుల సూచనలను ప్రజలు పెడచెవిన పెట్టడం వల్లనే చోరీలు జరుగుతున్నాయి. తమకు సమాచారం ఇస్తే తాళం వేసిన ఇంటిపై బ్లూ కోల్ట్స్ పోలీసులు నిఘా పెట్టడానికి అవకాశం ఉంటుందని పోలీసు అధికారులు అంటున్నారు. చోరీలను అరికట్టడానికి ప్రజల సహకారం కూడా అవసరమని వారు చెబుతున్నారు.

ఇటీవల జరిగిన చోరీ ఘటనలు

- మార్చి 8న రాత్రి మైదుకూరు రోడ్డులోని లక్ష్మీనగర్‌లో ప్రముఖ వ్యాపారి ఇంట్లో దుండగులు చొరబడి 850 గ్రాములు బంగారు, 670 గ్రాములు వెండి, రూ. 7.70 లక్షలు నగదును దోచుకెళ్లారు.
- అదే రోజు అదే కాలనీలో మరో అధికారి ఇంట్లో కూడా దొంగలు పడ్డారు. అయితే ఇంట్లో విలువైన వస్తువులేవి లేకపోవడంతో దొంగలు వెళ్లిపోయారు.
- అదే రోజు బైపాస్ రోడ్డులోని హ్యాపీహోంలో కూడా దొంగలు చోరీ యత్నం చేశారు. కాలనీ వాసులు పసిగట్టడంతో పరారయ్యారు.
- మార్చి 15న హౌసింగ్‌బోర్డు కాలనీలోని గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఇంట్లో సుమారు 25 తులాల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పై అంతస్తులో పడుకోగా.. కింద ఉన్న డోర్ లాక్‌ను తొలిగించి దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు.
- స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులో దొంగ ఇంట్లోకి ప్రవేశించి ఒంటరిగా ఉన్న మహిళ మెడలో నుంచి 12 తులాల బంగారు గొలుసును దోచుకెళ్లాడు. ఈ కేసులో టూ టౌన్ పోలీసులు దొంగను అరెస్ట్ చేసి సొత్తును రికవరీ చేశారు.
- ఇటీవల తాళ్లమాపురం గ్రామంలో ఇరువురు దుండగులు చోరీ చేసేందుకు ఒ ఇంటి ఆవరణంలోకి వెళ్లారు. వారి రాకను పసిగట్టిన యువతి గట్టిగా కేకలు వేసింది. దీంతో దొంగలు కట్టెతో యువతిపై దాడి చేసి పారిపోయారు.
- రామేశ్వరం బైపాస్ రోడ్డున ఉన్న గంగమ్మ ఆలయంలో పలుమార్లు హుండీని పగులకొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 23న దొరసానిపల్లె రోడ్డులో నకిలీ బిస్కెట్‌ను అంటకట్టి పల్నాడు జిల్లాకు చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తి దంపతులను మోసగించి వారి వద్ద నుంచి రూ. 5.20 లక్షలు తీసుకొని పరారయ్యాడు. ఈ కేసులో వన్‌టౌన్ పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేసి నగదు రికవరీ చేశారు.
- ఈ నెల 8న హోమస్‌పేటలో ఆయుర్వేద మందులు షాపు నిర్వహిస్తున్న సుభాషిణి వృద్ధురాలు మెడలో నుంచి 3 తులాల బంగారు చైన్‌ను దుండగుడు లాక్కొని వెళ్లాడు. మరుసటి రోజే త్రీ టౌన్ పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేసి బంగారు గొలుసు రికవరీ చేశారు.
- తాజాగా బొల్లవరంలో ఏకకాలంలో నాలుగు చోట్ల చోరీ చేశారు. అయితే వీరిలో రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఎనమల చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో భారీగా సొత్తు పోయింది. సుమారు 60 తులాల మేర బంగారు, రూ. 12 లక్షలు నగదు, 3 కిలోల వెండి, పట్టుచీరెలు, చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు చెన్నకేశవరెడ్డికి చెందిన 15 జతల కొత్త బట్టలను దోచుకెళ్లినట్లు బాధితులు చెబుతున్నారు.

వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక వైఎంఆర్ కాలనీలోని పెద్దమ్మ చెట్టు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫారంపై కోతి పడటంతో శుక్రవారం మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం అందించడంతో అగ్నిమాపక శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మైదుకూరు రోడ్డులో..

అలాగే మైదుకూరు రోడ్డులోని ఒక ఇండస్ట్రీ ఆరు బయట కొబ్బరి పీచు, పొట్టు అగ్ని ప్రమాదానికి గురై పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. రూ.20వేలు నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అగ్నిప్రమాదం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న టూ టౌన్ సీఐ సదాశివయ్య

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక హౌసింగ్‌బోర్డులోని భగత్ సింగ్ కాలనీలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో బ్యాంక్ క్యాబిన్‌తో పాటు కంప్యూటర్, కౌంటింగ్ మిషన్, ఫ్యాన్, కొన్ని ఫైళ్లు కాలిపోయాయి. శుక్రవారం సెలవు కావడంతో బ్యాంక్ తెరవలేదు. ఈ క్రమంలో రాత్రి బ్యాంక్‌లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది బ్యాంక్ వద్దకు చేరుకొని మంటలను ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. టూ టౌన్ సీఐ సదాశివయ్య, ఎస్ఐ రాఘవేంద్రారెడ్డిలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం గురించి అగ్నిమాపక అధికారితో మాట్లాడారు.

సీపీఎంతో నారాయణరెడ్డికి ఎలాంటి సంబంధం లేదు

- ఆయనకు ప్రాథమిక సభ్యత్వం కూడా లేదు
- సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



మీడియాతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

కడప సెవెన్‌రోడ్స్ : తమ పార్టీతో బి.నారాయణరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని, 2023 నుంచి ఆయనకు పార్టీ ప్రాథమిక సభ్యత్వం కూడా లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ స్పష్టం చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తమ పార్టీ జిల్లా కమిటీ తీర్మానాన్ని వివరించారు. ఈనెల 3, 18 తేదీల్లో నారాయణరెడ్డి , ఆయన కుటుంబ సభ్యుల భూ కబ్జాలపై పత్రికల్లో కథనాలు ప్రచురించారని, అయితే తమ పార్టీతో అతడికి ఎలాంటి సంబంధం లేన్నారు. సీపీఎం పద్ధతులకు భిన్నంగా వ్యవహరించిన తమ పార్టీ జిల్లా కార్యదర్శులను, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులను, జిల్లా కమిటీ సభ్యులను, పూర్తి కాలపు కార్యకర్తలను బహిష్కరించిన ఉదంతాలు గతంలో చాలా ఉన్నాయని పేర్కొన్నారు. చెమ్ముమియాపేట గ్రామ సర్వే నెంబరు 344లోని స్థలాన్ని మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీలో 2017లో తమ పార్టీ విజ్ఞప్తి మేరకు సుందరయ్య స్మారక కేంద్రం లైబ్రరీకి కేటాయిస్తూ తీర్మానం చేశారని పేర్కొన్నారు. సదరు స్థలాన్ని కబ్జాకోరులు ఆక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిన వెంటనే ఈ విషయాన్ని ఈనెల 2వ తేది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చామన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం వల్ల ఆ స్థలంలో కార్పొరేషన్ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. భగత్‌సింగ్ కాలనీలోని కమ్యూనిటీ స్థలాన్ని అధికారులు, స్థానిక ప్రజల అభీష్టం మేరకు కమ్యూనిటీ లైబ్రరీగా మార్చాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. నారాయణరెడ్డికిగానీ, వారి కుటుంబ సభ్యులకుగానీ పట్టా ఎలా వచ్చిందో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. నారాయణరెడ్డి భూ కబ్జాలపై ఏవైనా కథనాలు రాసేవారు తమ పార్టీ పేరు ఉపయోగించరాదని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఎ.రామ్మోహన్, వి.అన్వేష్‌తోపాటు దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల మాయంపై ఏసీబీ కేసు

15మంది అటవీశాఖ అధికారులపై విచారణకు ఆదేశం

కడప అర్బన్/ మైదుకూరు : మైదుకూరు పరిధిలో వనిపెంట అటవీ రేంజ్ గోడౌన్ నుంచి 1037 కిలోల 37దుంగలు మాయమయ్యాయి. ఎర్రచందనం దుంగలు మాయమైన ఘటనపై 2021 జనవరి 29న 15 మంది అటవీశాఖ అధికారులపై కేసు నమోదు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. 15 మంది అటవీశాఖ అధికారులు, సిబ్బందిని బాధ్యులుగా నిర్ధారించారు. తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి ఏసీబి వారు నివేదికను సమర్పించారు. ఏసీబి వారి నివేదికను ప్రభుత్వం పరిశీలించింది. ఈ సంఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. బాధ్యులైన అధికారులు, సిబ్బంది విచారణ ప్రారంభమయ్యేలోగా సంజాయిషి ఇచ్చుకునే అవకాశం కల్పిస్తూ విడివిడిగా నోటీసులు జారీ చేశారు. బాధ్యుల్లో రిటైర్డ్ ఉద్యోగులపై పెన్షన్ రూల్స్ మేరకు విచారణ జరుపనున్నారు. విచారణలో అప్పటి వనిపెంట అటవీ రేంజర్ సిహెచ్ దినేష్ కుమార్ రెడ్డి, ప్రొద్దుటూరు వైల్డ్ లైఫ్ డీఎఫ్ఓ నాగార్జున రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఆఫీసర్ విజ్ఞత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లను కేసులో అధికారులు పొందుపరిచారు. ఈమేరకు రాష్ట్ర పర్యావరణ అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంత రాము ఆ మేరకు 22 జీవోలను విడివిడిగా జారీ చేశారు. మైదుకూరు మండలం వనిపెంట అటవీ రేంజి కార్యాలయంలో 2021 జనవరి 29న ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. కాగా వనిపెంట రేంజి కార్యాలయంలో నిల్వ ఉంచిన 49 ఎరచ్రందనం దుంగలు మాయమయ్యాయని.. దానిపై ఏసీబీ అప్పటి డిఎఫ్ఓ, ఎఫ్ఆర్ఓ, సెక్షన్ అధికారులు, సిబ్బంది మొత్తం 15 మంది పై అభియోగాలు నమోదు చేసిందని సమాచారం. ఈ విషయంపై శుక్రవారం వనిపెంట రేంజ్ అధికారి ప్రణీతరావును వివరణ కోరగా అటవీ అధికారులపై అభియోగాలు నమోదు చేసేందుకు ఏసీబీ రంగం సిద్ధం చేసినట్లు తమకు తెలిసిందన్నారు. అయితే అధికారికంగా వెల్లడి చేయలేదని పేర్కొన్నారు. కాగా వనిపెంట రేంజి కార్యాలయంలో ఎరచ్రందనం దుంగలు 2018కి ముందే మాయమైనట్లు గుర్తించారని తెలిపారు. దానిపై విచారణ కూడా జరిగిందన్నారు. ఏసీబీ అధికారులు 2021లో రేంజి కార్యాలయంలో సోదాలు నిర్వహించిన సమయంలో కూడా దుంగలు మాయమైన విషయం గురించిన రికార్డులను పరిశీలించారని పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం



ముస్కార్ తార (ఫైల్)

రాజంపేట : ఎర్రబల్లిలో నివాసం ఉంటున్న సయ్యద్ ముస్కార్ తార (18) అనే బాలికకు మతిస్థిమితం సరిలేక అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు శుక్రవారం పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఈనెల 10వ తేది రాత్రి నుంచి కనబడుట లేదని, తమ కుమార్తె ఆచూకీ తెలిసిన వారు 9121100573, 9133817996 నెంబర్లకు సమాచారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కారు, స్కూటర్ ఢీ

– స్కూటరిస్టు మృతి

రామాపురం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా శుక్రవారం కారు, స్కూటర్ ఢీ కొని పప్పిరెడ్డి ఇరగంరెడ్డి (50) మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా.. మండలంలోని హసనాపురం పంచాయితీ గొల్లపల్లికి చెందిన పప్పిరెడ్డి ఇరగంరెడ్డి రామాపురంకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా పోలీస్‌స్టేషన్ సమీపానికి రాగానే కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు స్కూటర్ ఢీ కొంది. ఇరగంరెడ్డి కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మండల పోలీసులు తెలిపారు.

ఇరగంరెడ్డి మృతికి నివాళి

పప్పిరెడ్డి ఇరగంరెడడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇరగంరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకంటామన్నారు.

మోటార్లు పగులకొట్టి కాపర్ వైరు చోరీ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దిన్నెపాడు పంచాయతీలోని పర్వతరెడ్డిగారిపల్లి, దిన్నెపాడులో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైరు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. నారాయణ రెడ్డి, షేక్ కరీమ్, శివారెడ్డి, కాలేషా, ఇమాములు బాషతోపాటు మరో ఇద్దరు రైతుల మోటార్లను బయటకు తీసి పగులకొట్టి అందులో ఉన్న కాపర్ వైర్లు ఎత్తుకెళ్లారని బాధితులు వాపోయారు. అసలే ఎండాకాలం బోర్లలో అరకొర నీటితో పంటలు సాగు చేసుకుంటున్న ఈ తరుణంలో దొంగలు మోటార్లను పగులకొట్టి కాపర్ వైరు తీసుకెళ్లడంతో ఇబ్బందులు తప్పలేదన్నారు. లక్కిరెడ్డిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

పిడుగుపాటుకు పాడిఆవు మృతి

కలకడ : మండలంలో పిడుగుపడి పాడిఆవు మృతి చెందింది. కలకడ మండలం ఎనుగొండపాళ్యెం పంచాయతీ ఇంటిక్కువారిపల్లెకు చెందిన వెంకటేశ్వరనాయుడు పాడిఆవు మేత కోసం పంటపొలంలో ఉండగా శుక్రవారం సాయంత్రం కురిసిన గాలివానకు ఉరుములు మెరుపులతో పిడుగు పడింది. చెట్టుసమీపంలో మేత మేస్తున్న ఆవుపై పిడుగు పడటంతో పాడిఆవు అక్కడికి అక్కడే మృతి చెందింది. పాలదిగుబడితో కుటుంబాన్ని పోషించుకుంటూ రూ.లక్ష అప్పుచేసి కొనుగోలు చేసిన పాడిఆవు మృతిచెందడంతో కుటుంబ జీవనాధారం కోల్పోయానని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి తనను ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

జెడ్పీ ఛైర్మన్లకు గన్‌మెన్లను తొలగించడం దారుణం

జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎం. రామగోవిందరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి తదితరులు

వేంపల్లె : రాష్ట్రవ్యాప్తంగా జెడ్పీ ఛైర్మన్లకు గన్‌మెన్లను తొలగించడం దారుణమని జిల్లా పరిషత్ ఛైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవక తాగునీటి సమస్య అధికంగా ఉందని, వచ్చే జెడ్పీ నిధులతో ఎక్కడా కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మే 8న జెడ్పీ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో కలెక్టర్‌తో చర్చించి మొదటి ప్రాధాన్యతగా తాగునీటికి ఇవ్వనున్నామని, గత సమావేశాలలో కూటమి ఎమ్మెల్యేలు హాజరై జిల్లాలోని అనేక సమస్యలపై చర్చించకుండా గైర్హాజరు కావడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట, వేంపల్లె, సింహాద్రిపురం, లింగాల తదితర మండలాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16కోట్లను వేసవికాలంలో తాగునీటికి వినియోగిస్తామని తెలిపారు. ఇప్పటికే వివిధ రకాల పనులకు సంబంధించి రూ.6.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాపరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్ కుమార్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపిక



గంప రెడ్డిప్రసాద్

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం బీసీకాలనీకి చెందిన గంప నాగేంద్ర కుమారుడు గంపరెడ్డిప్రసాద్ గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన కబడ్డీ సెలక్షన్‌లో గంప రెడ్డిప్రసాద్ తనదైన ప్రతిభను కనబరచడంతో ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎన్నికయ్యాడు. హర్యానా రాష్ట్రంలో ప్రపంచదేశాల నుంచి వచ్చే ప్రతినిధులతో కబడ్డీ నిర్వహించనున్నారు. గంపరెడ్డిప్రసాద్ ఎంపికపై కుటుంబ సభ్యులు, మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలని వివాహిత విజ్ఞప్తి

- భర్తను విదేశాలకు పంపి, తనను పుట్టింటిలో వదిలేశారు
- ఆడపడచువివాహానికి అదనపు కట్నం తీసుకురమ్మంటున్నారు
- వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినా చర్యలు లేవు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్మాస్‌పేటలో నివాసం ఉంటున్న దొజీ జమీల్‌ఖాన్ కుమార్తె ఆసియఖానమ్ తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బాధితురాలు కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. తనకు కడప నగరంలోని ఖాన్ జ్యువెలరీ యజమాని షర్వానీ షబ్బీర్ అహ్మద్‌ఖాన్ కుమారుడు షర్వానీ ఫైరోజ్‌ఖాన్‌తో 2022 అక్టోబర్ 2వ తేదీన పెద్దల సమక్షంలో వివాహం చేశారు. వివాహ సమయంలో 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షలు కట్నంగా ఇచ్చారు. తరువాత విడతల వారీగా డబ్బులను, బంగారు ఆభరణాలను, తన తండ్రి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని భూమిని తన పేరుతో రాయించుకుని రమ్మని వేధిస్తున్నారని వాపోయింది. వివాహమైన రెండు నెలలకే తన భర్తను విదేశాలకు పంపించేశారు. గత ఏడాది ఏప్రిల్ 15న పుట్టింటిలో తనను వదిలేసి వెళ్లిపోయాడని, ఫోన్‌లోనే తన ఆడబిడ్డకు వివాహం కుదిరిందని, ఆమె వివాహానికి కూడా తన తల్లిదండ్రుల దగ్గరి నుంచి 50 తులాల బంగారు ఆభరణాలను, 20 లక్షల రూపాయలను అదనంగా తీసుకు రమ్మని వేధిస్తున్నారని చెప్పింది. గత ఏడాది అక్టోబర్ 29న కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో తన భర్త, అత్తామామ, ఆడబిడ్డపై కేసు నమోదు చేశారు. కానీ తనకు ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. వివాహాలను చేసుకుని భార్యను పుట్టింటిలోనే వదిలేసి విదేశాలకు వెళ్లిపోతున్న ఇలాంటి వారిపై ఎలాంటి చర్యలను తీసుకుంటారో, తనకు న్యాయం జరిగేలా చూడాలంది. తనలాగా ఏ ఆడపిల్లకు అన్యాయం జరగకూడదని వేడుకుంది.